క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోనేరుసెంటర్: మండలంలోని చిన్నాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ జీబీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10.30 గంటల వరకు పాతేరు, పోలాటితిప్ప, కోన, పల్లెతుమ్మలపాలెం గ్రామాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

నేలవాలిన వరిపంట



పెడన: మొన్నటి వరకు వర్షాలతో భయపెట్టిన వాతావరణం గత రెండు, మూడు రోజులుగా చల్లటి గాలులు అధికం కావడం, అప్పుడప్పుడు ఈదురు గాలులు వీస్తుండటంతో వరి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరికంకులు రాలిపోవడం, కంకులు బరువెక్కి నేలవాలిపోవడం చేస్తుండటం ఆర్వెస్టర్లతో కోతకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. నేలవాలిన పంటను తప్పనిసరిగా కూలీలను పెట్టి కోత కోయించాల్సిందేనని రైతులు పేర్కొంటున్నారు. దీంతో వ్యయం అధికమవుతుందని చెబుతున్నారు.

పైడమ్మ జాతర దుకాణాల బహిరంగ వేలం

పెడన: పెడన పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీపైడమ్మ అమ్మవారి జాతర దుకాణాలకు ఈ నెల 9వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనే వారు 7వ తేదీ సాయంత్రం ఐదు లోపు పురపాలక సంఘ కార్యాలయంలోని పైడమ్మ జాతర ఉత్సవాల గెజిట్ పుస్తకాన్ని రూ.100లతో కొనుగోలు చేసి 9న జరిగే వేలంలో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

వసతి గృహాలకు రూ.75.49 లక్షలు మంజూరు

అవనిగడ్డ: నియోజకవర్గంలోని ప్రభుత్వ వసతి గృహాల భవనాల మరమ్మతులకు రూ.75.49 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాజ్యాంగ నిర్మాతను విస్మరించిన నేతలు



నాగాయలంక: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి రోజున రాజకీయ పార్టీల నేతలు ఆయనకు కనీసం పూలమాల సమర్పించిన దాఖలాలు లేకపోవడం విచారకరమని నాగాయలంకలో ఎస్సీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నాగాయలంక పార్కు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు కూడా ఎవరూ సమర్పించక పోవడంతో వర్ధంతి వేళ మెడలో ఎండిపోయిన మాలతో ఆయన విగ్రహం వెలవెల పోయింది. ఇది విచారకరమైన సంఘటనగా బాధపడుతున్నామని స్థానిక ఎస్సీ నేత చీరాల తుఫాను వాపోయారు.

అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తాం

వెంకటాపురం(మోపిదేవి): రైతు సేవా కేంద్రాల ద్వారా అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయ అధికారిని హెబ్సీబారాణీ తెలిపారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో రోడ్డుపై ఆరపోసిన ధాన్యాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీపీటీ 5204, ఎంటీయూ 1262 వరి రకాలు కూడా కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలని సూచించారు. సబ్సిడీపై మినుము విత్తనాలు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే నియోజకవర్గ యువనాయకుడు మండలి వెంకట్రామ్ మండలంలో పర్యటించి ధాన్యం కొనుగోలను పరిశీలించారు. సీడీసీ మాజీ చైర్మన్ రావి నాగేశ్వరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యం తరలింపు

సాక్షి ఎఫెక్ట్

లంకపల్లి(ఘంటసాల): ఘంటసాల మండలం లంకపల్లి గ్రామంలో రైతులు ధాన్యాన్ని శనివారం సాయంత్రం లోపు మిల్లులకు తరలించనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీ కృష్ణ తెలిపారు. శుక్రవారం సాక్షిలో వచ్చిన అమలుకు నోచుకోని మంత్రి హామీ అనే కథనంపై స్పందించిన అధికారులు వీఏఏలను పంపించి ధాన్యంలో తేమ శాతాని పరిశీలించారు. లంకపల్లిలో మంత్రి పర్యటనలో పరిశీలించిన రైతుల ధాన్యాన్ని శనివారం సాయంత్రం లోపు ట్రక్ షీట్ జనరేట్ మిల్లులకు తరలించడం జరుగుతుందని ఏఓ తెలిపారు.

అటకెక్కిన ఇంటింటి చెత్త సేకరణ

- పురవీధుల్లో కానరాని సిబ్బంది
- డంపింగ్ యార్డులో పేరుకుంటున్న నిల్వలు
- సిబ్బంది, వాహనాల కొరత
- పట్టించుకోని అధికారులు



డంపింగ్ యార్డు వద్ద పేరుకుంటున్న చెత్త నిల్వలు



ఇంటింటికి చెత్త సేకరణకు సిబ్బంది రాకపోవడంతో చెత్తను బయట పారబోస్తున్న వైనం

పెడన: పురపాలక సంఘ పరిధిలో మొత్తం 23 వార్డుల్లో 31 వేలకు పైగా జనాభా ఉన్నారు. ఆయా వార్డుల్లో చెత్త సేకరిస్తే రోజుకు 16 నుంచి 20 మెట్రిక్ టన్నుల వరకు చెత్త వస్తుంది. అధికారిక గణాంకాల మేరకు రోజుకు 16 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నామని చెబుతున్నారు. ఎనిమిదేళ్లుగా ఇదే సంఖ్యను రికార్డుల్లో చూపుతూ, ఉన్నతాధికారులకు చెబుతూ వస్తున్నారు. రోజురోజుకు జనాభా పెరుగుదలతో పాటు చెత్త కూడా ఇబ్బడిముబ్బడిగా పెరుగుతూనే ఉంది. ఈ చెత్తను సేకరించడానికి పారిశుద్ధ్య కార్మికులు శ్రమిస్తున్న ఆరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. చెత్త సేకరణకు ఔట్ సోర్సింగ్ ద్వారా తీసుకున్న కొందరు కార్మికులు వివిధ విభాగాల్లో పనిచేస్తుండటంతో చెత్త సేకరణ మరింత ఇబ్బందిగా మారింది. వాస్తవంగా జనాభా ప్రాతిపదికన 70 నుంచి 75 మంది పారిశుద్ధ్య కార్మికులుండాలి. ప్రస్తుతం 51 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో వాహనాల డ్రైవర్లు, మేస్త్రీలు కూడా ఉన్నారు. వీరిలో ఎవరైనా సెలవు పెడితే అంతే. లేదా సెలవు రోజులు వచ్చినా, ఎవరైనా వీఐపీలు వస్తున్నారని ఇతర ప్రాంతాలకు విధులకు కేటాయించినా కూడా వార్డుల్లోను, ప్రధాన రహదారుల్లోను ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుంది. వార్డుల్లో అయితే రోజుల తరబడి అలాగే ఉంటుంది. ఇంటింటి చెత్త సేకరణకు వారానికి ఒకసారి వస్తున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు.

మేస్త్రీలు...శానిటరీ కార్యదర్శులున్నా... చక్కబడని దుస్థితి

గతంలో శానిటరీ మేస్త్రీలుండే వారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారి స్థానంలో సచివాలయాలకు చెందిన శానిటరీ కార్యదర్శులను నియమించింది. శానిటరీ కార్యదర్శులు తొమ్మిది మంది ఉన్నారు. ఇప్పుడు వీరికి తోడు శానిటరీ మేస్త్రీలు తోడయ్యారు. వీరొక ఐదుగురు ఉన్నారు. వీరి మధ్య పారిశుద్ధ్య సిబ్బంది నలిగిపోతున్నారు. మేస్త్రీలు ఒక పని చెబితే కార్యదర్శులు మరొక పని చెబుతున్నారంటూ పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. తమపై కార్యదర్శుల పెత్తనం ఏమిటనే ధోరణిలో మేస్త్రీలు ఉంటున్నారు. దీంతో కార్యదర్శులు కూడా చూసీచూడనట్లుగా, విధులకు హాజరై హాజరుకానట్లుగా నడుచుకుంటున్నారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. వార్డుల్లో పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ చెత్త సేకరణ చేస్తున్నారా లేదా అనే విషయాన్ని గాలికి వదిలేశారు.

వెంటాడుతున్న వాహనాల కొరత

స్వచ్ఛభారత్ ఇచ్చిన మూడు ఎలక్ట్రికల్ ఆటోలు మూలపడ్డాయి. ఒక డీజిల్ ఆటో కూడా పాడైపోయింది. ఏడు నెలల కింద పెద్ద కంపాస్టర్ వాహనం పాడవగా ఇప్పటివరకు మరమ్మతులకు నోచుకోలేదు. అప్పుడప్పుడు చిన కంపాస్టర్ కూడా రిపేరుకు వస్తుండడంతో రెండు మూడు రోజులు పక్కన పెడుతున్నారు. బాగు చేయించి వాడుతున్నారు. పూర్తిగా మూలకు చేరితే పరిస్థితి దారుణంగా ఉంటుంది.

సిబ్బంది, వాహనాల కొరత ఉంది



సిబ్బంది, వాహనాలు కొరత ఉన్న మాట వాస్తవం. పెద్ద కంపాస్టర్ వాహనం విజయవాడలో రిపేరు అవుతోంది. పలు వాహనాలు కూడా మూలపడ్డాయి. రెండు కొత్త ట్రాక్టర్లు వచ్చాయి. జనాభా ప్రాతిపదికన పారిశుద్ధ్య కార్మికులను తీసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.గోపాలరావు, కమిషనర్, పురపాలక సంఘం, పెడన

దళితుల అభ్యున్నతికి అంబేడ్కర్ కృషి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ విక్టర్‌ప్రసాద్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విక్టర్‌ప్రసాద్

మచిలీపట్నంటౌన్: దళితుల అభ్యున్నతికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. స్థానిక పోర్టురోడ్‌లోని పాత రైల్వే స్టేషన్ సెంటర్‌లో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన అంబేడ్కర్ సేవలను కొనియాడారు. దళిత సంఘ నాయకులు బూరగ రామారావు, దరిసే శ్రీరామ్, తప్పెట రాజు, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక అంబేడ్కర్ సర్కిల్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు (జానీ), జేఏసీ నాయకులు నివాళులర్పించారు. దళిత జేఏసీ జిల్లా కోశాధికారి కొడమంచిలి చంద్రశేఖర్, నగరశాఖ యువజన విభాగం అధ్యక్షుడు ఎలికే చైతన్య, మండల అధ్యక్షుడు ఉమ్మల గణేష్, దళిత జేఏసీ నాయకులు ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షుడు పాల్గొన్నారు.

ఉద్రిక్తత నడుమ ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం



అధికారులతో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: నగరంలోని జెడ్పీ సెంటర్ ప్రాంతంలో పెడన రోడ్‌లో ఉన్న రజకుల చెరువు గట్టుపై ఏళ్ల తరబడి నుంచి ఉన్న గృహాలు, దుకాణాల తొలగింపు శుక్రవారం ఉద్రిక్తత నడుమ జరిగింది. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో భారీ పోలీసు పహారా నడుమ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తొలగింపు చేపట్టారు. కొంత మంది దుకాణదారులు తమకు అక్టోబర్ 5వ తేదీన కోర్టు స్టేటస్‌కో ఇచ్చిందని బోర్డులు పెట్టారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ ఉంటున్న తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఎలా తొలగిస్తారని ఇది కోర్టు ధిక్కారం కాదా అని ప్రశ్నించారు. అయినా లెక్కచేయకుండా తొలగింపును కొనసాగించారు.

బాధితులకు అండగా పేర్ని కిట్టు

ఆక్రమణల తొలగింపు ప్రాంతాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఉన్న నివాసాలను, దుకాణాలను ఎలా తొలగిస్తారని టీపీఓ, సీఐలను ఆయన ప్రశ్నించారు. పేదల గృహాలను తొలగించడం ఎంత వరకు సబబని కమిషనర్ బాపిరాజును ప్రశ్నించారు. బాధితులకు అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులు ప్రారంభం



చల్లపల్లి రెవెన్యూ సదస్సులో అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



జింజేరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

యండకుదురు(ఘంటసాల): ఘంటసాల మండలం యండకుదురు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 9 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బి. విజయప్రసాద్ తెలిపారు. మండల నోడల్ ఆఫీసర్ ఎస్.వెంకట్రావు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: మండల పరిధిలోని కొర్లపాడు, నారాయణపురం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. సదస్సుల్లో 123 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి తెలిపారు.

కోనేరుసెంటర్: మండలంలోని గరాలదిబ్బ, గోపువానిపాలెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. గరాలదిబ్బలో 13, గోపువానిపాలెంలో 18 అర్జీలు వచ్చాయి. కార్యక్రమాల్లో జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, బందరు తహసీల్దార్ పి మధుసూధనరావు, అధికారులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: మండలంలోని పులిగడ్డ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ పి. పద్మావతి రెవెన్యూ సదస్సుల ఆవశ్యకతను వివరించారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అలాగే చల్లపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులోనూ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పాల్గొన్నారు.

బొబ్బర్లంక(మోపిదేవి): మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు మండలంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 17 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తెలిపారు. సమస్యలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు.

కోడూరు: రెవెన్యూ గ్రామసభల్లో రైతులు వివిధ సమస్యలపై 32 అర్జీలను అధికారులను అందించారు. మండలంలోని మాచవరం గ్రామంలో సర్పంచి అప్పికట్ల లక్ష్మి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో పట్టాదార్ పాస్‌పుస్తకాలు, అడంగల్ సవరణలు, భూ సర్వే తదితర అంశాలపై రైతులు అర్జీలు అందించినట్లు తహసీల్దార్ శ్రీనునాయక్ తెలిపారు.

పెడన: మండల పరిధిలోని జింజేరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి, స్పెషల్ ఆఫీసర్, డీఎల్‌డీవో పద్మావతి, ఇన్‌ఛార్జి తహసీల్దారు కే అనిల్‌కుమార్, డెప్యూటీ తహసీల్దారు సల్మా, ఆర్‌ఐ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకటనగేష్, ఈవోపీఆర్డీ జయరాం, టీడీపీ మండల అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, మండల సర్వేయర్ దాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నాగాయలంక: నాగాయలంక పరిధిలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. సదస్సులో 17 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎం. హరనాథ్ తెలిపారు. మండల ప్రత్యేకాధికారి కె. శంకరరావు, సర్పంచ్ కే అంకాలు, ఎంపీడీఓ జె. సీతారామ్‌కుమార్, డీటీ అబ్దుల్ రఫీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. 10వ తేదీన చోడవరంలో సదస్సు జరుగుతుందని తహసీల్దార్ చెప్పారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



విద్యార్థులతో డాక్టర్ విష్ణుప్రసాద్ ఆరోగ్యభారతి, కళాశాల సిబ్బంది

భావదేవరపల్లి(నాగాయలంక): ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యభారతి ఆధ్వర్యంలో స్థానిక ఎంవీకే రావు ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రథమ చికిత్సలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ధన్వంతరి జయంతి ఉత్సవాల్లో భాగంగా సంస్థ కృష్ణా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


ఘనంగా అంబేడ్కర్‌కు నివాళి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు



అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు



పెడన మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



బంటుమిల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జైబీం దళిత సంఘ సభ్యులు

కోనేరుసెంటర్: అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్టు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను అణగదొక్కిన యోధుడు అంబేడ్కర్ అన్నారు. ప్రపంచ దేశాలు గౌరవించే అంబేడ్కర్ భారతీయుడు కావడం మనమంతా గర్వించాల్సిన విషయమన్నారు. రాజ్యాంగంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం, సమాన హక్కులు కల్పించిన మేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్‌సిలార్‌దాదా మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలు, ఆశయాలు అందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ బొర్రా విఠల్, దళిత సంఘ నాయకులు జక్కుల ఆనంద్‌బాబు, బూరగ రామారావు తదితరులు ఎల్గొన్నారు.

అవనిగడ్డ: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఎనిమిదవ వార్డులో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అలాగే స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు గుర్రం బసవయ్య, నలుకుర్తి పృథ్వీరాజ్, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్‌నజీర్‌బాషా అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం, మాలమహానాడు కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

పెడన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పెడనలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, కార్యాలయ సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు నివాళులర్పించారు. కోడూరు వాసు, మున్సిపల్ ఆర్‌ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే బల్లిపర్రులోనూ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. జింజేరులోని రెవెన్యూ సదస్సులో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి, డీఎల్‌డీవో పద్మావతి, ఇన్‌ఛార్జి తహసీల్దారు కే అనిల్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు. తోటమూల సెంటరులో వైఎస్సార్ సీపీ నాయకులు కోడూరు శ్రీను, ముత్యాల మురళి తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

బంటుమిల్లి: డాక్టరు బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నివాళులర్పించారు. పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అలాగే జైభీం దళిత సంఘ సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ సభ్యులు వైస్ ఎంపీపీ ఒ. చిన్నారిబాబు, పి. బాబూరావు, టి.మోహన్‌రావు, కె.సాగర్, డి.రవి సుందర్ పాల్గొన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో సీపీఎం, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు ఎం. శ్రీనివాసరావు, జి. నాగేశ్వరరావు, బి.నాగరాజు, పి. వెంకన్న పాల్గొన్నారు.

కృత్తివెన్ను: అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ అధికారులు, జైభీమ్ సభ్యులు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: అంబేడ్కర్ వర్ధంతిని ఏఐఎస్ఎఫ్ కృష్ణా విశ్వవిద్యాలయం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా కార్యదర్శి సాదిక్ బాబు, వర్సిటీ నాయకులు ఝాన్సీ, గీతా, సూరజ్, యువరాజ్ పాల్గొన్నారు.

చిట్టూర్పు(ఘంటసాల): అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఘంటసాల మండలం చిట్టూర్పు పంచాయతీ శివారు నేతగాని ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి గ్రామస్తులు నివాళులర్పించారు. అలాగే ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. శాస్త్రవేత్తలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: కృష్ణా వర్సిటీలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నిర్వహించింది. సంఘ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. రెక్టార్ ఆచార్య ఎం.వి.బసవేశ్వరరావు, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య వై.కె. సుందరకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మోపిదేవి: మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రం మోపిదేవి దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి గ్రామసర్పంచ్ నందిగం మేరీరాణి నివాళులర్పించారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లపరాజుగూడెం గ్రామంలో శుక్రవారం స్థానిక పాల కేంద్రం ఆధ్వర్యంలో పాడి రైతులకు రూ. 96,112లు బోనస్ పంపిణీ చేశారు. గుడ్లవల్లేరు చిల్లింగ్ సెంటర్ మేనేజరు తోట సత్యన్నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు బోనస్ చెక్కులు అందజేశారు. కేంద్రం అధ్యక్షుడు పుప్పాల శ్రీరామమూర్తి, సూపర్‌వైజరు, డైరెక్టర్లు, కార్యదర్శి రైతులు పాల్గొన్నారు.

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి పాలకేంద్రంలో పాడి రైతులకు రూ.1,56,390 బోనస్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షురాలు బెల్లంకొండ లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సురేష్‌కుమార్, కార్యదర్శి మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మెగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

కోడూరు: సీయోను పాస్టర్స్ ఫెలోషిప్ కోడూరు ఆధ్వర్యంలో గురువారం మెగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత రామకృష్ణ థియేటర్ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలకు వేలాది మంది క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. పాస్టర్లు, సంఘ సేవకులు మెగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు.

వైభవంగా కల్యాణ మహోత్సవాలు

ఘంటసాల: ఘంటసాల గ్రామంలో వేంచేసియున్న శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 211వ కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం స్వామివారిని పెండ్లి కుమారుని చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జగజ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థినికి వీసీ అభినందన

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో నవంబర్ 21న ప్రముఖ కేంద్ర ప్రభుత్వ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో బెల్ కంపెనీ ట్రైనీ ఇంజినీర్‌గా కృష్ణా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని సి. కావ్య ఎంపికైనట్టు భారత్ ఎలక్ట్రానిక్స్ (బెల్ కంపెనీ) ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఆర్. శ్రీనివాసరావు, రెక్టార్ ఆచార్య ఎం. బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య కె. శోభన్ బాబు, ఇంజినీరింగ్ క్యాంపస్ ప్రిన్సిపల్ ఆర్ విజయకుమారి శుక్రవారం కావ్యను ప్రత్యేకంగా అభినందించారు.

సీసీ రోడ్ల నిర్మాణం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ. 30లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి తెలిపారు. గ్రామంలో వేస్తున్న రెండు అంతర్గత సీసీ రోడ్లను శుక్రవారం ఆమె పరిశీలించారు.

అర్చకుడి వసతి గృహం ప్రారంభం

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీచెన్నకేశవ స్వామివారి దేవస్థానం అర్చకుడి వసతి గృహాన్ని శుక్రువారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కూరపాటి వెంకట నాగకాంత కోటేశ్వరరావు, ఉమాదేవీ దంపతుల ఆర్థిక సాయం రూ. 33 లక్షలతో దేవస్థానం పక్కన నూతనంగా వసతి భవనం నిర్మించడం అభినందనీయమన్నారు. అనంతరం చెన్నకేశవస్వామిని దర్శించుకున్నారు. యువనాయకులు మండలి వెంకట్రామ్, సాయిప్రియ దంపతులు, దేవదాయశాఖ జిల్లా అధికారి ఎస్ వెంకట సాంబశివరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చలో గుంటూరు విజయవంతం చేయండి

మచిలీపట్నంటౌన్: అఖిల భారత మాలల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించే హలో మాల.. చలో గుంటూరు కార్యక్రమానికి మాలలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మచిలీపట్నం విచ్చేసిన ఆయన జిల్లా కోర్టు సెంటర్ సమీపంలో చలో గుంటూరు కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు.

పేరెంట్స్ మీటింగ్‌పై వినూత్న ప్రచారం

కోడూరు: విద్యాశాఖ ఆదేశాలతో శనివారం నిర్వహించే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంపై రామకృష్ణాపురం ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న ప్రచారం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు, గ్రామపెద్దలు, తల్లిదండ్రులందరూ సమావేశానికి హాజరు కావాలంటూ శుక్రవారం ఆటో ద్వారా ప్రచారం చేశారు. పంచాయతీ పరిధిలో ఉన్న రామకృష్ణాపురం, ఇరాలి, ఊటగుండం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఇంటింటికి వెళ్లి సమావేశానికి రావాలంటూ ఆహ్వాన పత్రికలు అందించారు. ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, హెచ్ఎం నాగార్జున, ఉపాధ్యాయులు మన్నె ప్రేమ్‌చంద్, పెరవలి రాంబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి షష్టి మహోత్సవాలు

కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా శనివారం నుంచి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్టి మహోత్సవాలు జరగనున్నాయి. మండలంలోని గరిశపూడిలో ప్రసిద్ధి గాంచిన స్వామివారి ఆలయం వద్ద ఐదురోజుల పాటు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. నీలిపూడి, మాట్లాం, చినగొల్లపాలెం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో షష్టి ఉత్సవాలు జరగనున్నాయి.